క్లుప్తంగా

మరిడమ్మ ఆలయంలో పూజలు



దాతలకు మరిడమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ విజయలక్ష్మి

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయంలో మాఘమాసం సందర్భంగా గురువారం మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వెండి, బంగారు పుష్పాలతో అర్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కుంకుమ భరిణె సమర్పణ

అమ్మవారికి తునికి చెందిన దాత దాడిశెట్టి శ్రీదేవి, శివకోటి దంపతులు సుమారు 292 గ్రాముల వెండి కుంకుమ భరిణెను సమర్పించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. దాతలకు ఈఓ విజయలక్ష్మి అమ్మవారి ఫొటోను బహూకరించారు.

వేణుగోపాలుని ఆలయంలో అన్నదానం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ధనుర్మాసం ముగింపు సందర్భంగా గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ నెల రోజుల పాటు సంకీర్తనలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ నాయకులు మర్ల రాంబాబు, నమ్మి శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్టీ రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: స్థానిక సబ్ స్టేషన్‌లో వార్షిక విద్యుత్ మరమ్మతుల వల్ల మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏపీఎస్ఎస్ ప్రభాకరావు గురువారం తెలిపారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట, కొండెవరం, పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లి, యండపల్లి, నాగులపల్లి, రమణక్కపేట, పాత నాగులపల్లి, పొన్నాడ, యండపల్లి రొయ్యల చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

సామర్లకోట: స్థానిక క్వారీ గోతులలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. క్వారీ గోతులలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై వీఆర్ మూర్తి తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.4,300 లతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కుంతీమాధవుని శ్రీపుష్పయాగం



పుష్పాలంకరణలో కుంతీమాధవ స్వామి

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి శ్రీపుష్పయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. దీనితో కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసాయి. స్వామివారిని, అమ్మవారిని పువ్వులతో సుందరంగా అలంకరించిన వేదికపై శ్రీపుష్పయాగం నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పించారు. కల్యాణోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించగా భక్తులు పూర్తి సహాయ సహకారాలు అందజేసినట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఎనిమిది మద్యం దుకాణాలపై కేసులు

కాకినాడ క్రైం: నిబంధనలు ఉల్లంఘించిన మద్యం దుకాణదారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ కాకినాడ నగరంలో గడచిన రెండు రోజుల్లో రాత్రి వేళల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నిబంధనలు అతిక్రమించి రాత్రి 10 గంటల తర్వాత మద్యం వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించారు. ఈ నేపథ్యంలో కాకినాడ వన్ టౌన్ పరిధిలో 4 దుకాణాలు, త్రీ టౌన్ పరిధిలో రెండు, సర్పవరం పరిధిలో రెండు దుకాణాలు మొత్తం 8 మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

ప్రణాళికతో పదింతల ఫలితం

- పరీక్షలకు సిద్ధమవుతున్న 1500 మంది విద్యార్థులు .
- మండలంలో 9 కేంద్రాల ఏర్పాటు



వైఎంఎం హైస్కూల్‌లో ప్రత్యేక శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సామర్లకోట: ప్రణాళికతో చదవడంతో పాటు కొద్ది పాటి మెళకువలు పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. వచ్చే నెల 17 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు రాయడానికి మండల పరిధిలో 16 ప్రభుత్వ పాఠశాలల్లోని 532 మంది బాలురు, 508 మంది బాలికలు, అలాగే 16 ప్రైవేటు పాఠశాలల్లోని 535 మంది బాలురు, 525 మంది బాలికలు సిద్ధమవుతున్నారు. సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, అయోధ్యరామపురం మున్సిపల్ హైస్కూల్, ప్రతిభ విద్యానికేతన్, వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో రెండు సెంటర్లు, నవర, వీకే రాయపురం, ఉండూరు జెడ్పీ హైస్కూళ్లను పరీక్షా కేంద్రాలకు కేటాయించారు. పదో తరగతి పరీక్షలంటే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఉత్కంఠ, ఒత్తిడి సహజం. ఈ క్రమంలో కొద్ది జాగ్రత్తలు, ఇంకొన్ని సూచనలు పాటించాలంటున్నారు ఉపాధ్యాయులు.

ప్రశాంతతతో సిద్ధమవ్వాలి



విద్యార్థులు ఏ మాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతతతో పరీక్షలకు సిద్ధమవ్వాలి. చదివిన పాఠ్యాంశాలను మననం చేసుకుంటూ ఉండాలి. ప్రశ్నా పత్రాన్ని క్షుణంగా ఒకటికి రెండు మార్లు చదవాలి. తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలి. ఏ ప్రశ్న ఇచ్చినా, అది తాము ఏడాది అంతా కష్టపడి నేర్చుకున్న అంశంపైనే ఉంటుందని గమనించాలి. నిర్ణీత సమయానికి ముందే హాల్ టిక్కెట్టుతో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ప్రతి ప్రశ్నకు సమాధానం రాసే ప్రయత్నం చేయాలి. ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షలతో విద్యార్థులలో అవగాహన పెరుగుతుంది.

– వై.శివరామకృష్ణయ్య, ఎంఈఓ, సామర్లకోట

మంచి దస్తూరీతో మంచి ఫలితాలు



విద్యార్థులు చక్కని దస్తూరీతో తప్పులు లేకుండా రాస్తే తెలుగు, ఇంగ్లిషు, హిందీలో మంచి మార్కులు సాధించవచ్చు. తెలుగులో మంచి మార్కులు సాధించడానికి రచయితల గురించి పాత్ర స్వభావాలు అర్థం చేసుకోవాలి. వ్యక్తీకరణ–సృజనాత్మకత సామర్థ్యంలోని అంశాలపై ఎక్కువ అవగాహన కలిగి ఉండాలి. లేఖలు, కరపత్రాలు, వ్యాసాలు, ఆకర్షణీయమైన శీర్షికలతో చక్కని పదజాలంతో మంచి విషయ విశ్లేషణను కూడి ఉండాలి. బిట్ పేపరులో మనం నిత్యం ఉపయోగించి సింపుల్ ఇంగ్లిషు మీద ప్రశ్నలు ఉంటాయి.

– యు.సత్యనారాయణ, హెచ్‌ఎం, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

గణితం, సైన్సు, సోషల్‌లో మంచి మార్కులు



భౌతికశాస్త్రంలో ఫార్ములాలు, సాంకేతికాలు మననం చేసుకోవాలి. పటాలు, భాగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. నిర్వచనాలు, భావనలు మననం చేసుకోవాలి. జీవశాస్త్రంలో మొక్కలకు, జంతువులకు మధ్య జీర్ణ, శ్వాస, విసర్జన, ప్రసరణ వంటి అంశాలను నిత్యం గమనిస్తూ ఉంటాం. ప్రతీ పాఠ్యాంశంలోని ప్రయోగాలు, బొమ్మలు, భాగాలతో గుర్తుంచుకుంటే జవాబులు సులభంగా రాయవచ్చు. సోషల్‌లో ఏ ప్రశ్నకైనా సొంతంగా సమాధానాలు రాయవచ్చు. గ్రాఫ్‌లు, ఇండియా, ప్రపంచ పటాలను కచ్చితంగా తెలుసుకోవాలి.

– టి.సాయిరామకృష్ణ, హెచ్‌ఎం, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

ప్రీ ఫైనల్‌తో ఆత్మ విశ్వాసం పెరిగింది



ఉపాధ్యాయులు తరుచూ రివిజన్ చేయించడం, పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలతో మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. పరీక్షలు అంటే ముందు కష్టం అనిపించింది. ఇప్పుడు సులువుగా అర్థం అవుతున్నాయి.

– వై.అనూష, సామర్లకోట

పాత ప్రశ్న పత్రాలతో తర్ఫీదు



ప్రతి రోజు పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్న పత్రాల ద్వారా చదవడం వల్ల పరీక్షలంటే భయం పోయింది. అదనపు తరగతుల ద్వారా మంచి ప్రయోజనం చేకూరుతోంది.

– కె.భవ్యశ్రీ, సామర్లకోట

ప్రమాదాల నివారణే లక్ష్యం

- జిల్లా రవాణాశాఖ కమిషనర్ శ్రీధర్
- ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు
- నేడు కాకినాడలో ముగింపు



కె.శ్రీధర్, జిల్లా రవాణాశాఖ అధికారి, కాకినాడ

బాలాజీచెరువు: గత జనవరి 17వ తేదీ నుంచి ప్రారంభమైన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ మేరకు జిల్లా రవాణాశాఖ కమిషనర్ కె.శ్రీధర్ గురువారం తన చాంబర్‌లో మాట్లాడుతూ ప్రధానంగా రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ మాసోత్సవాలు నిర్వహించామని, పోలీస్, ఆర్అండ్‌బీ, వైద్య, ఆరోగ్యం తదితర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారన్నారు. జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లకు అవగాహన, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్‌లలో వచ్చే ఏడాదికల్లా ప్రయాణాలు నివారించేందుకు ప్రణాళికలు రూపొందించి రహదారులపై ప్రమాదకర స్పాట్లపై సమీక్ష, విద్యా సంస్థల్లో, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులచే వాక్‌థాన్ నిర్వహించామన్నారు. ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ధారణపై సూచనలు, అంబులెన్స్ డ్రైవర్లకు గుడ్ సమరిటన్ కార్యక్రమంపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వాష్ అండ్ గో ప్రోగ్రాంలో భాగంగా అర్ధరాత్రి వాహనాలు ఆపి ఫేస్ వాష్ చేయించడంతో పాటు టీ సౌకర్యం కల్పించామన్నారు.

నేడు ముగింపు..

కాకినాడ లారీ అసోసియేషన్ హాల్లో నిర్వహించే ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పాల్గొంటారన్నారు. డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు, ఊపిరితిత్తులు, ఎముకలు, గుండె సంబంధిత వైద్య పరీక్షలతో పాటు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

'మండలి'కి మేధావులను ఎన్నుకోండి



మహారాణి కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

పెద్దాపురం: మేధావులను, సమర్థులను ఎన్నుకొని, శాసన మండలికి పంపించాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులుకు మద్దతుగా పెద్దాపురం పట్టణంలో గురువారం నిర్వహించిన ప్రచారంలో గోపిమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటియూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన నిజాయితీగా పోరాడుతున్నది పీడీఎఫ్ అభ్యర్థులేనని అన్నారు. ఉద్యోగుల పీఆర్‌సీ, ఐఆర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్లకు కనీసం వేతనాలు, మెగా డీఎస్సీ, రైతులకు గిట్టుబాటు ధరలు వంటి సమస్యలపై నిర్వహించిన పోరాటాలకు పీడీఎఫ్ అభ్యర్థులే మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని పట్టభద్రులందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న రాఘవులు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా సేవలందించారని తెలిపారు. ఆయనను మండలికి ఎన్నుకోవాలని పట్టభద్రులకు ఎమ్మెల్సీ గోపిమూర్తి విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానిక మహారాణి కళాశాల, బార్ అసోషియేషన్, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయండి

- డీఆర్వో వెంకటరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమీక్షలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. 0–5 ఏళ్ల వయసు గల పిల్లల ఆధార్ నమోదు, పిల్లల బయో అప్‌డేట్ చేయడం, తల్లిదండ్రుల అప్‌డేట్ చేసిన పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల నమోదు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ సంఖ్య నమోదు, గ్రామ, వార్డు సచివాలయం, పోస్ట్ ఆఫీస్ ఇతర కార్యాలయాల్లో జరుగుతున్న ఆధార్ నమోదుల వంటి అంశాలపై డీఆర్వో వెంకటరావు చర్చించారు. 0–5 సంవత్సరాల వయసు గల పిల్లలకు సంబంధించి 70 వేల మందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలన్నారు. డీ–యాక్టివేషన్ నివారించడానికి పిల్లల అందరి బయో అప్‌డేట్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులందరికీ ఆధార్ సంఖ్య నమోదు చేయాలన్నారు. ఇందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఆర్వో తెలిపారు. అదే విధంగా 15 నుంచి 17 ఏళ్ల వయస్సులో గల వారి బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 97 ఆధార్ కిట్లకు గాను 82 ఆధార్ కిట్లు వివిధ మండలాల్లో పని చేస్తున్నాయన్నారు. మిగిలిన 15 సాంకేతిక లోపంతో వినియోగించడం లేదన్నారు. అదే విధంగా ప్రతి ఆధార్ కేంద్రంలో వివిధ సేవలకు సంబంధించి వసూలు చేసే ధరల వివరాలతో కూడిన పోస్టర్లను కేంద్రాల వద్ద ప్రదర్శించాలని డీఆర్వో అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, శ్రీరమణి, జిల్లా ఆధార్ మేనేజర్ జి.గిరిధర్, గ్రామ, వార్డు సచివాలయ సమన్వయ కర్త జె.శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, డీపీవో వి.రవికుమార్, పోస్టల్ పీఆర్‌ఐసీ కె.ప్రసాదరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు



బుకింగ్ కౌంటర్ ఆవరణలో రంగులు వేస్తున్న సిబ్బంది

సామర్లకోట: ఈ నెల 18వ తేదీన రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ రానున్న నేపథ్యంలో స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను జీఎం రానున్న నేపథ్యంలో ఈ నెల రెండో తేదీన డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ ఇప్పటికే పరిశీలించారు. ఆయన సూచనల మేరకు బుకింగ్ కౌంటర్ హాల్‌కు రంగులు వేస్తున్నారు. అలాగే ప్రయాణికులు వేచి ఉండడానికి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై 50 కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరా పనులు, ఆధునిక ఎలక్ట్రికల్ లైన్లు, రైల్వే స్టేషన్ ఆర్చీ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ పనులను రైల్వే మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.గిరి పర్యవేక్షిస్తున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో రమణయ్యపేటలో పట్టుబడిన నిందితులతో సర్పవరం పోలీసులు

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జరిపేందుకు గాను గంజాయితో రమణయ్యపేట పరిసరాలలో సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను రమణయ్యపేట డ్రైనేజీ కాలువ బండ వద్ద సర్పవరం పోలీసులు గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో దండుపుంతకు చెందిన వలస గిరిధర్, ఏపీఎస్పీ ఎదురుగా ఉన్న ప్రాంతానికి చెందిన మీసాల వివేక్, మరో బాలుడు కలిసి 6 కిలోల 200గ్రాముల గంజాయితో పట్టుబడ్డారన్నారు. నిందితులు గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి కాకినాడలో అధిక ధరకు విక్రయించేందుకు ప్రణాళిక వేశారన్నారు. జిల్లా ఎస్పీ బి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు తాము చేపట్టి ఆపరేషన్‌లో నిందితులు పట్టుబడ్డారన్నారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్సై శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు.

అన్నవరం కాంట్రాక్టర్‌కు జరిమానా

- మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు
- రూ.20 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు
- కాంట్రాక్టర్‌కు రూ.5 లక్షల భారీ వడ్డన

కాకినాడ లీగల్: అన్నవరం దేవస్థానంలోని సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు చేసినందుకు వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. వివరాలలోకి వెళితే కాకినాడకు చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబర్ 3న అన్నవరంలో తన ఫోన్‌ను డిపాజిట్ కౌంటర్‌లో ఉంచారు. అందుకు ఆయన రూ.5 చెల్లించాల్సి ఉండగా కౌంటర్ సిబ్బంది ఆయన నుంచి రూ.10 తీసుకున్నారు. దీనిపై ఆయన అక్కడి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తీర్పులో లక్ష్మీనారాయణకు అదనంగా తీసుకున్న రూ.5తో పాటు మానసిక ఒత్తిడి గురైనందుకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు ఇవ్వాలని, అలాగే కాంట్రాక్టరు రూ.5 లక్షల జరిమానాను దేవస్థానానికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కాకినాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుజీ, చాగంటి నాగేశ్వరరావు ఈ నెల 11వ తేదీన ఈ మేరకు తీర్పు చెప్పారు.

పైపులైన్‌కు మరమ్మతులు



తాగునీటి ప్రధాన పైపులైనుకు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది



పైపులైన్‌కు మరమ్మతులు చేసిన అనంతరం..

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప కాపుల రామాలయం వద్ద తాగునీటి ప్రధాన పైపులైనుకు అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. ‘సాక్షి’లో మంగళవారం పైప్‌లైను లీకేజీతో తాగునీరు కలుషితం అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించి గురువారం తాగునీరు ప్రధాన పైపులైను మరమ్మతులు చేశారు.

సాక్షి ఎఫెక్ట్

ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు స్థల పరిశీలన



క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడలో నూతనంగా నిర్మించనున్న క్యాన్సర్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను కలెక్టర్ షణ్మోహన్ గురువారం పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణ పక్కన ఉన్న మున్సిపల్ అతిథి గృహ స్థలాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఏపీఎంఎస్ఐడీసీ ఇతర ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన 500 పడకల నూతన సమీకృత ఆయుర్వేద ఆసుపత్రిని ఆయన ఆయుష్ వైద్య అధికారులు, ఏపీఎంఎస్ ఐడీసీ, జీపీటీ కళాశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నరాజు, డీఈ ఎస్ఎస్ చక్రవర్తి, ఆయుష్ వైద్య అధికారులు మహమ్మద్ షాజన్ అలీ, కె శ్రీనివాసు, జీపీటీ ఇన్‌చార్జి మున్సిపల్ సంజయ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరునికి పుష్పోత్సవం



స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దివ్యకళ్యాణ వేడుకల్లో భాగంగా గురువారంరాత్రి పుష్పోత్సవం వేడుకగా నిర్వహించారు. స్వామివారి దివ్యకళ్యాణ మహోత్సవం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించి, ఆలయ మండపంలో ఊయలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పవళింపుసేవ చేశారు.

మేల్ నర్సుపై విచారణకు ఆదేశం

- బ్లాంక్ పేపర్లపై సంతకాలు పెట్టించడంపై కలెక్టర్ సీరియస్
- వరుస ఫిర్యాదులు, ఆరోపణలతో చర్యలకు రంగం సిద్ధం
- కలెక్టర్ ఆదేశాలలో కమిటీ నియామకం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో కాంట్రాక్టు విధానంలో మేల్ నర్సుగా పనిచేస్తున్న పోలాబత్తిన శ్రీనివాసరావుపై విచారణకు ఆదేశిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, రేడియేషన్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్‌లు విచారణాధికారులుగా, సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు కాగా గురువారం విచారణ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం శ్రీనివాసరావు ఖాళీ పత్రాలపై సుమారు 60 మంది స్టాఫ్ నర్సులతో సంతకాలు చేయించుకున్నాడు. ఎందుకని వారు ప్రశ్నిస్తే నర్సుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించేందుకంటూ నమ్మబలికాడు. అధికారులు ఈ విషయంపై పరిశీలించగా నర్సులను తప్పుదోవ పట్టించాడని, తనకు గిట్టని సహోద్యోగులపై ఉన్న వైషమ్యాలతో, వారికి వ్యతిరేకంగా కుట్ర పన్ని సంతకాల సేకరణ చేపట్టాడని నిర్ధారణ అయింది. ఈ విషయంపై నర్సింగ్ సూపరింటెండెంట్ నర్సులను వివరణ కోరగా, నర్సుల సమస్యల కోసం అంటూ తమను తప్పుదోవ పట్టించి ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరించాడని 60 మంది నర్సులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సంతకాల సేకరణకు నర్సింగ్ అసోసియేషన్, ఏపీ ఎన్‌జీవో, జీజీహెచ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సంఘాల పేర్లు అనధికారికంగా వాడుకున్నాడు. ఆయా సంఘ నాయకులు కూడా శ్రీనివాసరావుపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘన నేపథ్యంలో నర్సెస్ స్ట్రగుల్ కమిటీ జిల్లా విభాగం నుంచి రాష్ట్ర నాయకత్వం అతనిని బహిష్కరించింది. దీంతో తన సహోద్యోగులైన మహిళా నర్సులపై సామాజిక మాధ్యమాలలో పేర్లు ప్రస్తావించి మరీ తప్పుడు ఆరోపణలు చేశాడు. తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్, సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, హెచ్‌వోడీలు ప్రలోభాలకు లొంగి ఉత్తమ సేవా పురస్కారాలకు సిఫార్సు చేశారని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. దీనిపై తనకు అవార్డు ఇవ్వలేదన్న అక్కసుతో ఈ పసలేని ఆరోపణలను వాట్సాప్ వేదికగా విస్తృత ప్రచారం చేశాడని ఆసుపత్రి అధికారులు తెలిపారు. అలాగే, సర్జికల్ భవంతిలో విధుల్లో ఉన్న పలువురు పీజీ వైద్యులను కూడా హ్యూమన్ రైట్స్ ప్రతినిధిని అంటూ బెదిరింపులకు గురిచేశాడు. శ్రీనివాసరావు పెట్టిన మెసేజ్‌ల స్క్రీన్ షాట్‌లు, వాయిస్ మెసేజ్‌లను జతచేస్తూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులు కలెక్టర్ వరకు చేరాయి. వరుస ఫిర్యాదులు, మహిళా నర్సులను సామాజిక మాధ్యమాల వేదికగా వేధిస్తున్నాడన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ సీరియస్ అయ్యారు. వాస్తవాలను నిగ్గు తేల్చాలని పేర్కొంటూ కమిటీ ఏర్పాటు చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిటీ నియామకం జరిగింది. ఈ నెల 15వ తేదీ లోపు విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలలో పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నగరపాలక సంస్థ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ భావన గురువారం తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు చేపట్టిన ఏడీబీ రోడ్డు పనుల వల్ల సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే కాకినాడ నగరపాలక సంస్థ నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతుల నిమిత్తం ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఆమె తెలిపారు. 1500 ఎంఎం లైన్‌పై నాలుగు చోట్ల పైప్‌లను అనుసంధానం చేసి 21వ తేదీ ఉదయం మంచినీటి సరఫరా చేస్తామన్నారు. దీని వల్ల శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచి నీటి సరఫరా అయ్యే రిజర్వాయర్లు శశికాంత్ నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏజీఎం, శ్రీనివాస బ్యాంకు కాలనీ (గైగోలపాడు), 1 నుంచి 13, 49, 50 వార్డుల పరిధిలో ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లు ద్వారా మంచి నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాల ప్రజలు ముందస్తుగా మంచినీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. మంచి నీరు అత్యవసరమైతే నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా నీటిని పంపేందుకు 63013 87834, 96767 70461, 73820 42977 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.